క్లుప్తంగా

వెయిట్ లిఫ్టింగ్‌లో బాలికల ప్రతిభ



పతకాలు సాధించిన బాలికలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోదాడ : హైదరాబాద్‌లోని జయశంకర్ ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల క్రితం జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ వెయిట్ లిఫ్టింగ్ లీగ్ పోటీల్లో కోదాడ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికలు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం బి.సుశీలబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 48 కేజీల విభాగంలో అలేఖ్య, 59 కేజీల విభాగంలో వర్షిత ప్రతిభ చాటి కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారిని హెచ్‌ఎంతో పాటు పీడీ నీరజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆది వరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దివ్య క్షేత్రంలో మంగళవారం క్షేత్రపాలకుడు శ్రీఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం 108 తమల పాకులతో ఆకు పూజ, గంధ సింధూరంతో ప్రత్యేక పూజలు జరిపారు. పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పులిహోర, వడమాల, ప్రసాద నివేదన, తీర్థప్రసాదాల వితరణ గావించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారిణి స్రవంతి

మునగాల : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లు రవీందర్, స్రవంతి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత–పరిసరాల పరిశుభ్రత అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, సురేష్, నాగలక్ష్మి, వసతిగృహాల వార్డెన్లు షేక్ సలీమ్, నీలమ్మ, సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన గ్రామ పాలన అధికారులు



జీపీఓలతో తహసీల్దార్ కమలాకర్

పాలకవీడు : మండలంలో గ్రామ పాలన అధికారులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బొత్తలపాలెం గ్రామ పాలన అధికారిగా కోటా రాజు, గుడుగుంట్లపాలెం గ్రామానికి మండలి సతీష్, పాలకవీడుకు మద్దెల ముత్తయ్య, జాన్‌పహాడ్‌కు షేక్ మహమ్మద్, గుండ్లపహాడ్‌కు షేక్ ఖాసీంఅలీ, రావిపహాడ్ గ్రామానికి బాచు వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాలకవీడు తహసీల్దార్ కార్యాలయంలో జీపీఓలతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ కమలాకర్ మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేసి ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిజం విస్తరణలో మావో పాత్ర కీలకం



మావో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

కోదాడరూరల్ : కమ్యూనిజాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేయడంలో మావో పాత్ర ఎంతో కీలకమైందని అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. మంగళవారం పట్టణంలోని లాల్ బంగ్లాలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మావో 48వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీడిత దేశాల్లో జరిగే విప్లవోద్యమాన్ని ముందుకు నడిపేందుకు విప్లవకారులకు మావో ఆదర్శంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి.నరసింహారావు, విజయ్, వీరబాబు, నగేష్, సలీం, రవితేజ, ఖాసీం, నరసింహారావు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వరద నష్టం.. ఇంకెన్నాళ్లీ కష్టం

- నడిగూడెంలో ఇరుపక్కల ఆక్రమణకు గురైన వాగు
- మట్టి, చెత్తాచెదారంతో పూడిక
- వరదలొస్తే జలమయమవుతున్న వీధులు.. ఇళ్లలో చేరుతున్న నీరు
- దెబ్బతిన్న కల్వర్టు, రోడ్డుకు ఏడాదిగా మరమ్మతులు కరువు



బీసీ కాలనీలో కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశం



నడిగూడెం ఎస్సీ, బీసీ కాలనీల మధ్య దెబ్బతిన్న కల్వర్టు

నడిగూడెం : మండల కేంద్రంలోని వాగు పూడి, ఇరుపక్కల ఆక్రమణకు గురవ్వడంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వీధులన్నీ జలమయమవుతున్నాయి. బస్టాండ్ వెంట ఉన్న చౌదరి చెరువు అలుగు పోసిన సమయంలో వాగులో నీరు సాఫీగా వెళ్లక బీసీ, ఎస్సీ కాలనీల మధ్య ఉప్పొంగుతోంది. దీంతో గ్రామంలోని పలు వీధుల గూండా వరద నీరు ప్రవహించి ఇళ్లలోకి చేరుతోంది. గత ఏడాదితో పాటు ఈ ఏడాది 20 రోజుల క్రితం కురిసి వర్షాలకు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వరదలకు గతేడాది ఎస్సీ, బీసీ కాలనీల మధ్య ఉన్న వంతెన పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో ఏడాదిగా ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. నేటికీ వంతెనకు మరమ్మతులు చేపట్టలేదు. అలాగే బీసీ కాలనీలో పలు చోట్ల వంతెనలు ఏర్పాటు చేసేందుకు మూడేళ్ల కిందట గూనలు ఏర్పాటు చేసి వదిలేశారు. పనులు మాత్రం చేపట్టలేదు.

నీట మునుగుతున్న ఇళ్లు..

బస్టాండ్ సెంటర్ నుంచి బీసీ కాలనీ మీదుగా ఎస్సీ కాలనీవరకు దాదాపు 1.50 కిలోమీటర్ల దూరం వరకు పాతకాలం నాటి వాగు ఉంది. వర్షాకాలం వస్తే చాలు చౌదరి చెరువు అలుగు పోసి వాగు నిండుగా ప్రవహించి గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలలోని ఇళ్లు నీట మునుగుతున్నాయి. ఈ వాగు ఆక్రమణలు తొలగించి వాగుపై వంతెనలు, కల్వర్టు, వాగుకు ఇరువైపులా రాళ్లతో లైనింగ్, వాగు పూడిక తీస్తే వరద నీరు సారంగేశ్వరస్వామి చెరువులోకి సాఫీగా వెళ్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వాగుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సీజనల్ వ్యాధుల వ్యాప్తి..

వర్షాకాలంలో చౌదరి చెరువు అలుగు పోస్తుండడంతో కొద్ది రోజుల పాటు వాగులో నీరు ప్రవహిస్తుంది. ఆ తర్వాత వాగులో ఇళ్లల్లోని మురుగు నీరు ప్రవహిస్తుంది. దీంతో ప్రతి ఏడాది వాగు వెంట ఇళ్లల్లో అనేక మంది సీజనల్ వ్యాధుల బారిన పడుతుంటారు. ఈ ఏడాది ఇప్పటికే పలువురు డెంగ్యూ, విష జ్వరాల బారిన పడి వైద్యం పొందుతున్నారు.

దుర్వాసన వస్తోంది



వాగు వెంట ఉన్న మా ఇళ్లల్లోకి దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగల సంచారం పెరిగింది. పలువురు ఇప్పటికే విషజ్వరాల బారిన పడ్డారు. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి. – బొల్లం యల్లేష్, నడిగూడెం

రాకపోకలకు ఇబ్బందులు



గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు మా కాలనీలో వాగుపై ఉన్న కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో గత ఏడాదిగా రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలి – సాల శ్రీను, నడిగూడెం

ప్రతిపాదనలు పంపాం

నడిగూడెంలోని వాగు శాశ్వత మరమ్మతుల కోసం రూ.4 కోట్లకు అంచనాలు వేసి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడుతాం. బస్టాండ్ వంతెన, గ్రామంలో ఐదు చోట్ల కల్వర్టులు నిర్మిస్తాం. – వెంకటేశ్వర్లు, ఏఈ, నీటిపారుదల శాఖ, నడిగూడెం

న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించాలి



హుజూర్‌నగర్ కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్ : న్యాయవాదుల రక్షణకు చట్టం రూపొందించి అమలు చేయాలని పలువురు న్యాయవాదులు డిమాండ్ చేశారు. జీడిమెట్లకు చెందిన న్యాయవాది బండారు సురేష్ బాబుపై కొందరు దాడిచేసి గాయపరచడాన్ని ఖండిస్తూ మంగళవారం హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. చట్టానికి లోబడి పని చేస్తున్న న్యాయవాదులపై ప్రతివాద కక్షిదారులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని భౌతిక దాడులకు పాల్పడటం, బెదిరించటం న్యాయ వ్యవస్థకే గొడ్డలి పెట్టని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణకు చట్టాన్ని రూపొందించకపోతే దేశ వ్యాప్తంగా న్యాయవాదులు ఉద్యమించి ప్రభుత్వాలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. తమ విధుల బహిష్కరణకు సహకరించాలని కోరుతూ బార్ అసోసియేషన్ చేసిన తీర్మాన కాపీలను రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి లక్ష్మీ శారద, సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీనాకు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి చనగాని యాదగిరి, ఉపాధ్యక్షుడు జక్కుల నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు, న్యాయవాదులు డి.శ్రీనివాసరావు, ఎంఎస్ రాఘవరావు, వీజీకే మూర్తి, వి.యాదగిరి, పి.శ్రీనివాసరావు, రమణారెడ్డి, రామ లక్ష్మారెడ్డి, సైదా హుస్సేన్, వెంకటేష్, వెంకటేశ్వర్లు, శ్రీనునాయక్, వెంకటేష్‌నాయక్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కోదాడరూరల్ : మండల పరిధిలోని పాలేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను కోదాడ రూరల్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళితండా గ్రామానికి చెందిన ధరావత్ నెహ్రూ ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామ సమీపంలోని పాలేరు వాగు నుంచి ఇసుకను కోదాడకు తరలిస్తుండగా మార్గ మధ్యలో చిమిర్యాల క్రాస్ రోడ్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సరిపడా యూరియా అందించాలని ధర్నా



చిలుకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

చిలుకూరు : రైతులకు సరిపడా యూరియా అందించాలని పలువురు సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ధృవకుమార్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. రైతులు వ్యవసాయ పనులు మానుకొని ఒక్క బస్తా యూరియా కోసం ఉదయం నుంచి రాత్రి వరకు క్యూలైన్‌లో నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు వేనేపల్లి వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జెల్లా నరసింహారావు, మండల కార్యదర్శి నాగాటి రాములు, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో యూరియా అందించాలి



మాట్లాడుతున్న బద్దం కృష్ణారెడ్డి

అనంతగిరి : రైతులకు ప్రభుత్వం సకాలంలో యూరియా అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బద్దం కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం శాంతినగర్‌లో జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్న దుకాణాలను అధికారులు తనిఖీ చేసి చర్యలు చేపట్టాలని కోరారు. గత కొన్ని రోజులుగా రైతులు యూరియా కోసం అరిగోస పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సీపీఐ ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని, అనంతగిరి మండలంలో సెప్టెంబర్ 16వ తేదీన తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 16వ తేదీన కోదాడలో జరిగే సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎరసాని రవి, నాగభద్రం, డేగ వీరన్న, బత్తిని వీరబాబు, షేక్ మీరంభి, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గోవిజ్ఞాన పరీక్షలు



గోవిజ్ఞాన పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్, జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు మంగళవారం గో సేవా విభాగ్ ఆధ్వర్యంలో గో విజ్ఞాన పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గోవులతో మానవాళికి కలిగే ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు, షీల్డ్‌లు అందజేస్తామని, 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయి పరీక్షలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. పరీక్షల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికేట్లు అందజేస్తామని తెలిపారు. ఈ పరీక్షల్లో సేంద్రియ వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, గో పోషణ అవశ్యకత తదితర అంశాలపై ప్రశ్నలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో బహుమతుల దాత మాశెట్టి శ్రీహరి, గోసేవా సభ్యులు సపావత్ రాము, కొలిపాక జగదీష్, సలిగంటి వాసు, మనోజ్, ప్రసన్న, నాగమణి, సాయికృష్ణ, నాగరాజు, రామ్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు, ఉపాధ్యాయులకు సన్మానం



జర్నలిస్టులను సన్మానిస్తున్న వాసవి, వనిత క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో సోమవారం రాత్రి వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో జర్నలిస్టులు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. జర్నలిస్టులు టీఎస్.స్వామి, అలక సైదిరెడ్డి, ఈగ శ్రీనివాస్‌రావు, బుడిగే శంకర్, వీరయ్య, శ్రీనివాస్, రామకృష్ణ, రవీందర్, యుగేందర్, పుల్లారావు, సైదులు, బాలకృష్ణ, ఉపాధ్యాయులు నరసకుమారీ, ఉపేందర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రవంతి, అనసూర్య, శ్రీనివాస్, శ్రీదేవి, శ్రీధర్, అక్కయ్యబాబును సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, డిస్ట్రిక్ వీఆర్‌ఓ గరిణె అరుణకుమారిరీ, కొత్త లక్ష్మణ్, ఐత కృష్ణ సుమంత్, గరిణె జ్యోతి, సుధాకర్, నటరాజ్, కందిబండ నర్మద, వెంకటేశ్వర్లు, వాసు, రాము, సంధ్య, గోపాలకృష్ణ, కిషన్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

మునగాల : మునగాల గ్రామపంచాయతీలో కామాటీగా విధులు నిర్వర్తిస్తున్న నిరుపేద అన్నెపాక వెంకటరత్నం (50) ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. మంగళవారం వెంకటరత్నం కుటుంబానికి సామాజిక కార్యకర్త చింతకాయల నాగరాజు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రోడ్డు శ్రీను, చింతకాయల వెంకటేష్, తన్నీరు వేణు, ఎల్.గుర్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

హుజూర్‌నగర్ : గంజాయి, మాదకద్రవ్యాలు అరికట్టాలి, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ వద్దు, మన ఆరోగ్యమే ముద్దు అనే నినాదంతో ముద్రించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం తహసీల్దార్ నాగార్జున రెడ్డి, డాక్టర్ రవి వేర్వేరుగా ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో వీరబాబు, అనిల్, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు యూత్ కాంగ్రెస్ కమిటీ నియామకం

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలోని అన్ని మండలాల యూత్ కాంగ్రెస్ కమిటీలను నియమించనున్నట్లు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కడపు మహేష్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. బుధవారం హుజూర్‌నగర్ మండల కమిటీ ఎన్నిక పూర్తిచేస్తామని అన్నారు.

ప్రజాకవి కాళోజీ నారాయణరావుకు నివాళి



నేరేడుచర్ల : మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



కోదాడరూరల్ : బాలాజీనగర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌డబ్ల్యూఓ, విద్యార్థులు

కోదాడరూరల్ : ప్రజాకవి, తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను కోదాడ పట్టణం, మండలంలోని పలుచోట్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఇస్సాక్ హుస్సేన్, అదే విధంగా బాలాజీనగర్‌లోని గిరిజ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ కె.నాగజ్యోతిలు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాష కోసం ముఖ్యంగా తెలంగాణ భాష, యాస అభివృద్ధికి కాళోజీ ఎంతో కృషి చేశారని అన్నారు.

కాళోజీ చూపిన మార్గంలో నడవాలి

కోదాడ : తెలంగాణలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న దోపిడీ, అణిచివేతలపై తిరగబడిన యోధుడు, మహనీయుడు కాళోజీ అని, ఆయన చూపిన మార్గంలో యువత నడవాలని ప్రజాచైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి చిన్ని అన్నారు. మంగళవారం కాళోజీ జయంతిని పురస్కరించుకొని స్థానిక ఎంఎస్ కళాశాలలో ప్రజాచైతన్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో రాపర్తి రామనర్సయ్య, మొగిలిచర్ల అంజయ్య, బడుగుల సైదులు, ముత్తవరపు రామారావు, పాకనాటి రాఘవరెడ్డి, ఉదయగిరి, వక్కంతుల నరసింహారావు, మామిడి రామారావు, చలిగంటి రామారావు, గురులింగం తదితరులు పాల్గొన్నారు.

కేఆర్ఆర్ కళాశాలలో..

పట్టణంలోని కేఆర్ఆర్ జూనియర్ కళాశాలలో కాళోజీ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవణారెడ్డి, వేముల వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో..

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కాళోజీ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.మార్కొండేయ, వీరబ్రహ్మాచారి, జానకిరామ్, చిన్నప్ప, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..



చిలుకూరు : కాళోజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్ ధృవకుమార్, తదితరులు

నేరేడుచర్ల : మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, ఆర్‌ఓ జి. శ్రీనివాస్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో..

నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళోజీ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి ఎంఈఓ పుట్లూరి సత్యనారాయణరెడ్డి, హెచ్‌ఎం బట్టు మధు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు సైదులు, రహీద్‌ఖాన్, జానకిరాములు, శౌరీ, వెంకటేశ్వర్‌రావు, అన్నపూర్ణ, మాధవి, నర్సింహారావు, భానుమతి, నాగమణి, బికోజి, రామ్మూర్తి, బాలు, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వరావు, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్పీలు శ్రీనయ్య, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) ఆధ్వర్యంలో..

నేరేడుచర్లలో కాళోజీ జయంతిని సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి ఎపార్టీ డివిజన్ కార్యదర్శి వాస పల్లయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి వాస కరుణాకర్, అంబటి బిక్షం, హుస్సేన్, సత్తెమ్మ, ఆనంద్, దేవయ్య, లక్ష్మయ్య, మల్లేశ్వరి, నరసమ్మ, మంగమ్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో, మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, సీనియర్ అసిస్టెంట్ పుష్ప, ఆర్‌ఐలు మంత్రిప్రగడ సీతరామచందర్‌రావు, శ్వేత, ప్రధానోపాధ్యాయుడు గుజ్జుల నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



నడిగూడెం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..




హుజూర్‌నగర్ : కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.విజయకుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్.జానిపాషా, క ర్నాటి శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ భాషా దినోత్సవం


హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో తెలంగాణ భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని అలరించాయి. ప్రిన్సిపాల్ గుంటుపల్లి శ్రీనివాసరావు, అధ్యాపకులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) ఆధ్వర్యంలో..



చిలుకూరు: నారాయణపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో..



కోదాడ: నివాళులర్పిస్తున్న ప్రజాచైతన్య వేదిక సభ్యులు

6 గంటలకే క్యూలైన్‌లో..

కోదాడరూరల్ : కోదాడ పీఏసీఎస్ పరిధిలోని కూచిపూడికి 220 బస్తాల యూరియా వచ్చింది. ఆ యూరియా కోసం కూచిపూడితో పాటు కూచిపూడి తండా ప్రజలు ఉదయం 6 గంటల నుంచే గోడౌన్ వద్ద క్యూలో నిలబడ్డారు. ఆ తర్వాత పీఏసీఎస్ సిబ్బంది కొద్ది దూరంలో ఓ చెట్టు కింద రైతుల పట్టాదారు, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకొని వాటిని సీరియల్‌లో పెట్టి ఒక్కో రైతుకు ఒక్క బస్తా మాత్రమే యూరియా ఇస్తున్నారు. 220 బస్తాలకు గాను దాదాపుగా 300 రైతులు ఉండగా యూరియా అందని రైతులకు వచ్చే సారి ఇస్తామని చెప్పి పంపించారు.



యూరియా కోసం పట్టాదారు, ఆధార్ కార్డులను సీరియల్‌లో పెట్టి చిట్టీ రాయించుకుంటున్న రైతులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



గరిడేపల్లి : చత్రునాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



కోదాడ : బడుగుల సైదులును సన్మానిస్తున్న ప్రజాచైతన్య వేదిక సభ్యులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎంఈఓ చత్రునాయక్‌ను ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి బాలసైదిరెడ్డి, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, సైదిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోదేశి దయాకర్, ఎస్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారావు, నాగరాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోదాడ : ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బడుగుల సైదులును మంగళవారం ఎంఎస్ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రజాచైతన్య వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ రాయపూడి చిన్ని మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న బడుగుల సైదులు అభినందనీయుడని అన్నారు. కార్యక్రమంలో ప్రజాచైతన్య వేదిక సభ్యులు పాల్గొన్నారు.